## క్లుప్తంగా

### ప్రజలు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శనివారం డోన్‌లోని తన స్వగృహంలో మెడికవర్ హాస్పిటల్ ప్రత్యేక హెల్త్ ప్యాకేజి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మెడికవర్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ నీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నపిల్లల క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీలో చికిత్స

కర్నూలు(హాస్పిటల్): చిన్నపిల్లలకు వచ్చే క్యాన్సర్‌లకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా చికిత్స అందుకోవచ్చని చిన్నపిల్లల క్యాన్సర్ వైద్యులు డాక్టర్ కాశీభారతి చెప్పారు. చిన్నపిల్లల క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా విశ్వభారతి మెడికల్ కాలేజీ, క్యాన్సర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి. కాంతారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాయలసీమలోనే మొదటిసారిగా చిన్నపిల్లల క్యాన్సర్‌కు స్పెషలిస్టు వైద్యులను నియమించామన్నారు.

### కర్నూలుకు చేరిన యాత్ర

కర్నూలు సిటీ: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్(ఏఐపీటీఎఫ్)ఆధ్వర్యంలో చేపట్టిన భారత యాత్ర శనివారం కర్నూలుకు చేరుకుంది. ఈ యాత్రకు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(అప్టా) నాయకులు స్వాగతం పలికారు. అప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు అధ్యక్షతన సీక్యాంపులోని లలితాకళా క్షేత్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏఐపీటీఎఫ్ జాతీయ కోశాధికారి హరిగోవిందన్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గురికర్, ఢిల్లీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, మహిళ విభాగం జాతీయ నాయకురాలు సీమా మాధుర్, రమాదేవి ప్రసంగించారు.

### కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్ష

కర్నూలు: ఎస్‌ఐ అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 17వ రోజు 856 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను పరిశీలించి, బయోమెట్రిక్ తీసుకుని, ఎత్తు, ఛాతీ కొలతలను చూశారు. అనంతరం నిర్వహించిన 1600 మీటర్ల పరుగులో 670 మంది, 100 మీటర్ల పరుగులో 463 మంది, లాంగ్ జంప్‌లో 564 మంది ప్రతిభ కనపరిచి ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 583 మంది ఎస్‌ఐ తుది రాత పరీక్ష (మెయిన్స్)కు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ పర్యవేక్షించారు.

### రవాణా రంగం పరిరక్షణకు ఉద్యమం

కర్నూలు(సెంట్రల్): రవాణా రంగం పరిరక్షణ కోసం ఉద్యమించనున్నట్లు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలులోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్‌కు సంబంధించి రాష్ట్ర స్థాయి వర్క్ షాపు జరిగింది. ముందుగా నగరంలో భారీ ఆటోల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహరావు, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, నాయకులు సుందరయ్య, అయ్యప్పరెడ్డి, జె.దివాకర్, శ్రీనివాస్, అంజిబాబు, రాధాకృష్ణ, నిర్మల పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కర్నూలు (టౌన్) : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలత, డీఈఈలు నరేష్ ఏఈలు పాల్గొన్నారు.

### కాంపౌండ్ వాల్ నిర్మాణం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: 35వ వార్డు పరిధిలోని శివప్ప నగర్‌లో ఈశ్వర ఆంజనేయ స్వామి దేవాలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శనివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో హామీ మేరకు కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, నాయకులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకా... మమ్మేలు నాయకా

- ప్రజల్లో మొదలైన మార్పు
- మట్టి విగ్రహాల ఏర్పాటుపై ఆసక్తి
- పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమవుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు
- ఎనిమిదేళ్లుగా వినాయక చవితికి మట్టి విగ్రహాల తయారీ
- భక్తులకు ఉచితంగా పంపిణీ



మట్టి గణపతి తయారు చేస్తున్న విద్యార్థినులు



వివేకానంద స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను తయారు చేసి ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**కర్నూలు కల్చరల్: ' శైలీ దారుమయీ లౌహీ లేప్యా లేఖ్యాచ సైకతీ మనోమయి మణిమయీ ప్రతిమా అష్టవిధా స్మృతా' భాగవతంలోని శ్లోకమిది.**
ఎనిమిది రకాలుగా విగ్రహాలు పూజింప దగినవి. వాటిలో మొదటిది శిలా విగ్రహం, రెండోది చెక్క విగ్రహం, మూడోది లోహపు విగ్రహం (పంచలోహం), నాల్గోది గోమయ లేపనం (స్థండిలం), ఐదోది లిఖించబడినది, ఆరోది మట్టితో చేసినది, ఏడవది మనసులో చింతింపబడిన మనోవిగ్రహం, ఎనిమిదవది సూర్యకాంతమణి. ఈ ఎనిమిది రకాల విగ్రహాలను తయారు చేసుకుని భగవంతుడుని, దేవతలని పూజించాలి తప్పా ఇతర ఏ రసాయనాల ద్వారా తయారు చేసిన విగ్రహాలు పూజకు అనర్హం, నిషిద్ధం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్, ఇతర హానికరమైన రసాయనాలతో తయారు చేయబడిన ఏ విగ్రహాలతో భగవంతుడు, దేవతలను పూజింప తగదు అన్నది ఆ శ్లోకం యొక్క అర్థం.

**ప్రకృతి హితంగా పూజిద్దాం...**

వినాయక చవితి వచ్చిందంటే చాలు విగ్రహాల ఎత్తు, రంగుల విషయంలో పోటీపడి కొనుగోలుకు సిద్ధమవుతారు. నవరాత్రులు ముగిసిన అనంతరం నీళ్లలో నిమజ్జనం చేస్తారు. అధికంగా విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసినవే ఉంటున్నాయి. వీటితో కాలుష్యం పెరుగుతుందనే విషయం తెలిసినా, ఆ విగ్రహాల కొనుగోలుకే చాలా మంది మక్కువ చూపుతున్నారు. తద్వారా జల కాలుష్యం పెరుగుతుంది. ప్రకృతిని, జంతు జీవాల్ని ప్రేమించాలని ప్రబోధించే ఈ పండుగను, దానికి విరుద్ధమైన పోకడలతో జరుపుకోవడం తగదని పర్యావరణ ప్రేమికులంటున్నారు. మట్టితో చేసిన వినాయకుడిని పూజించాలని శాస్త్రం చెబుతుంది. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తే పర్యావరణాన్ని కాపాడిన వారవుతారు

**మొదలైన మార్పు**

కర్నూలు నగరం, నంద్యాల పట్టణంతో పాటు ఇతర పట్టణాలు, నియోజక వర్గ, మండల కేంద్రాల్లో సుమారు పదివేల వరకు పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు గృహాల్లో పూజల నిమిత్తం సుమారు లక్ష చిన్న విగ్రహాలను వినియోగిస్తారు. గృహాల్లో దాదాపు 80 శాతం వరకు మట్టి వినాయక ప్రతిమలనే ఉపయోగిస్తున్నారు. పెద్ద విగ్రహాల్లో మాత్రం జిల్లా వ్యాప్తంగా 30 శాతం వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసే 2,600 విగ్రహాల్లో దాదాపు 50 శాతం ఆ విగ్రహాలనే ప్రతిష్ఠిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అవగాహన కల్పిస్తుండటంతో క్రమంగా ప్రజల్లో ఈ మార్పు మొదలైంది. ఇందులో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్ వారు ప్రధాన భూమిక పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**250 విగ్రహాలతో మొదలు**

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నాగఫణి శాస్త్రి మార్గదర్శనంలో కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులు శ్రీకాంత్, భువన, పృథ్వి, మహిత, చంద్రప్రియ, తేజేశ్వర్‌రెడ్డి, రవి, నిఖిత, సౌజన్య, అర్పిత, ప్రణవ్, అహ్మద్, కబీర్, సుస్మిత, యశ్వంతి, సూర్య, లలిత తదితరులు ఐదేళ్ల క్రితం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయటం ప్రారంభించారు. మొదటి సంవత్సరం 250 విగ్రహాలను తయారు చేసి కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులకు పంపిణీ చేశారు. తరువాత ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల విగ్రహాల వరకు తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా బీటెక్ విద్యార్థులు సాయి చరణ్, భార్గవ తేజ, మోనిష్‌చంద్ర, శరత్ నరసింహరెడ్డి, రామకృష్ణ, గోపాల్, నవీన్, అభిషేక్, మానస, సౌమ్య, మాధవి, సుచిత్ర, లావణ్య, రచన, చరిత, కావ్యలు మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేసేందుకు పూనుకున్నారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల తయారీలో పోటీలు సైతం నిర్వహించి విజేతలకు బహుతులను అందజేస్తున్నారు.

### మట్టి విగ్రహాలనే పూజించాలి



ప్రతి చోట కాలుష్యం పెరుగుతోంది. దాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి. వినాయక చవితికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మేము మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేస్తున్నాం. ఇందులో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది. – నవ్య, బీటెక్ విద్యార్థిని

### అవగాహన కల్పిస్తున్నాం



మన సంస్కృతి పరిరక్షణకు పర్వదినాలను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలి. వినాయక చవితి పర్వదినాన్ని కాలుష్య రహితంగా జరుపుకోడానికి అవగాహన కల్పిస్తున్నాం. మట్టి వినాయక విగ్రహాలను పూజించటం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కానీ నష్టం కానీ జరగదు. అందుకే మేము మట్టి విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – శ్వేత, ఇంజినీరింగ్ విద్యార్థిని

### కాలుష్యానికి చెక్



సమాజానికి ఎలాంటి హాని కలగకుండా వినాయక చవితిని జరుపుకోవాలి. పండగల ఉద్దేశం కూడా అదే కావడంతో మేము మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇచ్చి తయారు చేస్తున్నాం. మాలాగే మిగతా కళాశాలల వారు కూడా ముందుకు రావాలి. దీని వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించిన వాళ్లమవుతాం. – మోనిష్ చంద్ర, బీటెక్ విద్యార్థి

### ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): శ్రీ వాసవి ఏజెన్సీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాతబస్టాండ్‌లో మట్టి వినాయక విగ్రహాలను పారిశ్రామిక వేత్త టీజీ భరత్ చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. ఏజెన్సీ అధినేత శేషఫణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు గోరంట్ల రమణ, అవోపా నాగేశ్వరరావు, టీవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం**

మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు.డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం అనే పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా సహాయ కార్యదర్శి మునీస్‌బాషా, అబ్దుల్లా, వినయ్ పాల్గొన్నారు.

### మట్టి వినాయకులనే పూజిద్దాం



ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు (టౌన్): మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపు నిచ్చారు. వినాయకచవితిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ పరిధిలోని 40 వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి సహకారంతో స్థానిక సాయిబాబా మందిరంలో 100 మట్టి వినాయకుల విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. మైపర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

- అవగాహన కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్



హాజరైన వైద్య విద్యార్థులు,



మాట్లాడుతున్న జడ్జి పి. దివాకర్

కర్నూలు(హాస్పిటల్): తోటి విద్యార్థులను, జూనియర్లను ర్యాగింగ్ చేయొద్దని, దీని వల్ల జీవితం నాశనమవుతుందని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి పి. దివాకర్ చెప్పారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజిలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ దుష్ప్రభావాలు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించిన శిక్షాపరమైన నిబంధనలను వివరించారు. నేరం తీవ్రతను బట్టి శిక్ష పరిమాణం మారుతుందని చెప్పారు. ర్యాగింగ్ అనేది అసహ్యకర సంఘటన అని, అది బాధితుని మనస్సులో శాశ్వతమైన మచ్చను మిగిలిస్తుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పొత్తుల కంటే ప్రజాబలం గొప్పది

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్) : ఎన్నికల్లో విజయం సాధించాలంటే పొత్తుల కంటే ప్రజల బలం గొప్పగా పనిచేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాల కోసం వచ్చే ఎన్నికల్లో గుంట నక్కల్లా చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తులు పెట్టుకుని కలసి పోటీ చేసినా రాజకీయాల్లో సింహం లాంటి ముఖ్యమంత్రి జగన్‌ను ఓడించలేరని సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి అందించనటువంటి సంక్షేమ సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. ఆయనకు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని చెప్పారు. అవకాశవాద రాజకీయాలు చేసే చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జైలుకెళ్లిన టీడీపీ అధినేత నిజంగా తప్పు చేయకుంటే కోర్టులో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని బయటకు రావాలని హితవు పలికారు. చంద్రబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రాముడు, కప్పట్రాళ్ల మాలింగ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పాలనకు జనం నీరాజనం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



బాలాజీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో 99.5 శాతం పూర్తి చేయడంతో ప్రతి కుటుంబానికి రూ.50వేల నుంచి రూ.5లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఎంతో సంతృప్తితో ఆప్యాయంగా పలకరిస్తూ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. శనివారం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 40వ వార్డు బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, కర్నూలు మండలం వైస్ ఎంపీపీ2 నెహమ్యాతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

## స్పోర్ట్స్

**కరాటే పోటీల్లో కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ**

కర్నూలు (టౌన్): ఈనెల 12 వ తేదీ కేరళ రాష్ట్రంలో సౌత్ ఏషియన్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియన్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వెంకటరమణకాలనీ కేశవ రెడ్డి విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ -17 విభాగంలో 10 వ తరగతికి చెందిన సుగంధిని రెడ్డి అండర్-14 విభాగంలో ఏడవ తరగతికి చెందిన హవీష్, రిషికేష్ పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో ఆ విద్యాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవరెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే నెల ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు.

**క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు**

కర్నూలు (టౌన్) : క్రీడల్లో రాణిస్తే బాలికలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కల్లూరు మండల స్థాయి బాలికల టోర్నమెంటు, ఎంపిక పోటీలు నిర్వహించారు. ఖో-ఖో పోటీలను సీఈఓ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, నియోజక వర్గ క్రీడల ఇన్‌చార్జ్ పాల్ సుధాకర్, మండల ఇన్‌చార్జ్ అబ్రహాంలింకన్ పాల్గొన్నారు.

## నోటీస్ బోర్డు

**టూరిజం అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం**

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ట్రావెల్ అండ్ టూరిజం ఇండస్ట్రీలోని బెస్ట్ హోటల్, బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్, బెస్ట్ హరిత హోటల్, బెస్ట్ చెఫ్, బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ బస్టాండ్, బెస్ట్ ట్రావెల్ ఏజెంట్, బెస్ట్ టూరిస్ట్ గైడ్, బెస్ట్ జర్నలిస్ట్, బెస్ట్‌ఫిల్మ్ ఆన్ ఏపీ టూరిజం తదితర 41 రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు www.a pot uri-r-m.-g-o-v.i n వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఎంపికైన వారికి 27వ తేదీన నిర్వహించే రాష్ట్రస్థాయి ఈవెంట్‌లో అవార్డులు అందజేస్తామన్నారు.

**30 న వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం**

కర్నూలు (టౌన్): నగరంలోని చికెన్, మటన్, చేపల షాపుల వద్ద వ్యర్థాల సేకరణకు ఈనెల 30 వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

# అర్హులందరికీ పెన్షన్లు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పెన్షన్లు మంజూరవుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. పార్టీలు, రాజకీయాలు, కులాలు, మతాలు చూడకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ కావాలంటే ఎవరో ఒకరో పెన్షన్‌దారుడు చనిపోతే తప్పా మరొకరికి వచ్చేది కాదన్నారు. శనివారం 43వ వార్డు లోని 113 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ హాజరై ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలను పొందామని ప్రజలు ఆయనకు వివరించారు. అనంతరం వీధుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీని గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, రంగన్న, నాగేశ్వరరావు, ప్రసాదు, షఫీ, సంజమ్మ, రేణుక, సుశీల పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

**వ్యక్తి ఆత్మహత్య**

కర్నూలు : కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ అమీర్ హుసేన్ (36) కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామానికి చెందిన అతడు పాలిష్ బండల కటింగ్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. 18 ఏళ్ల క్రితం నజీమున్నీసాతో వివాహమైంది. కొన్నాళ్లు సంసారం సాఫీగానే సాగింది. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి విడిపోయారు. అయితే లోక్ అదాలత్‌లో ఇరువురు రాజీ అయి కేసు పరిష్కరించుకుని మళ్లీ ఒకటయ్యారు. ఈనెల 14వ తేదీన భార్యాభర్తలు మళ్లీ గొడవ పడ్డారు. ఈక్రమంలో అమీర్ హుసేన్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. సోదరుడు షేక్ రహిమాన్ ఫిర్యాదుతో అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**నిడ్జూరులో మరొకరు...**

కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన బోయ నవీన్ (28) పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయన వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు కనుగొని ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుతో కర్నూలు అర్బన్ తాలూకా ఎస్‌ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు సంతానం.

## ఈ రోజు

**విశ్వకర్మ జయంతి**

కర్నూలు (అర్బన్): విశ్వకర్మ జయంతిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10:30 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో...**

విశ్వకర్మ జయంతిని స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## విన్నపం

**నవోదయలో మౌలిక వసతులు కల్పించండి**

కర్నూలు(సెంట్రల్): బనవాసి నవోదయ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు ప్రిన్సిపాల్ చంద్రన్ విన్నవించారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో అధ్యాపక బృందం ఎంపీని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా సోలార్ హీటర్లు, ఆర్‌ఓ వాటర్ ప్లాంటు, అంతర్గత రహదారులను నిర్మించాలని కోరగా...ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

## సంక్షిప్తం

**వ్యాస రచన, పోస్టర్ ప్రదర్శన పోటీలు**

కర్నూలు సిటీ: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా శనివారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఇన్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఆర్ ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.ప్రసాదు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**జీఓ. నంబర్ 660ని రద్దుచేయాలి**

కర్నూలు(సెంట్రల్): 2023-24 ఖరీఫ్ పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 660ని రద్దు చేయాలని, హంద్రీనీవా నుంచి గుండ్లకొండ స్లూయిజ్‌కు నీటిని విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు ఆయన కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు.

**28న జాతీయ కవయిత్రుల సమ్మేళనం**

కర్నూలు కల్చరల్: గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనంలో పాల్గొనే వారు ఈనెల 20వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94402 28999 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు**

కర్నూలు (న్యూసిటీ) : ఆర్‌యూ పరిధిలోని ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వీసీ ఎ.ఆనందరావు తెలిపారు. 44 మంది గాను 40 మంది విద్యార్థులు పరీక్ష రాశారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**ఇరువురు ఏఈలకు పదోన్నతులు**

కర్నూలు (టౌన్): వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇరువురు అసిస్టెంట్ ఇంజినీర్లకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. కర్నూలు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి. రసూల్‌కు డీఈఈగా పదోన్నతి కల్పించి డోన్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అలాగే గుంతకల్లు మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి. శ్రీకాంత్‌బాబుకు గఈఈగా పదోన్నతి కల్పించి కర్నూలు నగరపాలక సంస్థ ఇంజినీర్ విభాగానికి బదిలీ చేసింది.

**ప్లానింగ్ కార్యదర్శులకు మెమోలు జారీ**

కర్నూలు (టౌన్) : నగరపాలకసంస్థ పరిధిలోని 136 సచివాలయాల్లో పనిచేస్తున్న ప్లానింగ్ కార్యదర్శులకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ మీనా కుమారి శనివారం మెమోలు జారీ చేశారు. ఈనెల 16 నుంచి వచ్చే నెల 16 వ తేదీ వరకు అనవసరంగా సెలవులు తీసుకోవద్దని తెలిపారు. తప్పనిసరి అయితే సిటీ ప్లానర్ అనుమతి తీసుకోవాలని తెలిపారు.

**సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి**

కర్నూలు కల్చరల్: మన సంస్కృతి సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద అన్నారు. శనివారం పలు పాఠశాలల్లో భగవద్గీత కంఠస్థ శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన పోటీల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.

**శాంతియుతంగా వినాయకచవితి జరుపుకోవాలి**

కర్నూలు : వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను అన్ని వర్గాల వారు కలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ పిలుపునిచ్చారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో శనివారం హిందూ, ముస్లిం మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ జరిగింది. కార్యక్రమానికి కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అతిథిగా హాజరై మాట్లాడారు.